
# మహిళా దశాబ్దంలో ఓ మగువ కథ



శీలంశెట్టి రమాదేవి

శ్రీధరం వెళ్ళేసరికి రామారావ్ హాల్లోనే అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు సీరియస్‌గా!

శ్రీధరాన్ని చూడగానే ముఖంలో ఎలాంటి మార్పూ లేకుండానే "రా! కూర్చో!" అన్నాడు పొడిగా.

ఇది చాలా ఆశ్చర్యాన్ని కలగజేసింది శ్రీధరానికి.

తనెప్పుడు అతనింటికి వచ్చినా భార్యాభర్తలిద్దరూ ఎంతో ఆప్యాయంగా, ఆనందంగా ఆహ్వానిస్తారు.

రామారావ్‌కి తను ప్రాణస్నేహితుడు. తను ఉద్యోగంలో చేరిన కొద్ది రోజులకే అతనూ చేరాడు. పక్క పక్క సీట్లు కావడంతో ఇద్దరకూ పరిచయం పెరిగింది. ఇద్దరి అభిరుచులూ చాలా వరకూ ఏకీభవించడంతో ఆ పరిచయం ప్రాణ స్నేహంగానూ మారింది.

ఇద్దరకూ ఇంచుమించుగా సంవత్సరం క్రితమే వివాహం కూడా అయింది. అప్పుడప్పుడు వారింటికి వీరు - వీరింటికి వారూ ఆహ్వానింపబడటం కూడా కద్దు. రామారావ్ భార్య రాధాదేవి దగ్గర శ్రీధరానికి చాలా చనువుంది. భర్తకి ప్రాణ స్నేహితుడన్న అభిమానంకొద్దీ - స్వంత సోదరునిలా భావించుకొంటూ వుండేది.

"ఏమిటో ఆలోచిస్తున్నట్లున్నావ్?" అన్నాడు పడక్కుర్చీలో కూర్చుంటూ శ్రీధరం.

లోపల గోడకానుకుని ముఖం చేతుల్లో దాచుకొని ఏడుస్తోన్న రాధ శ్రీధరాన్ని చూడగానే ముఖం చీర చెంగుతో తుడుచుకొని లోపలికెళ్ళిపోయింది.

"ఏమిట్రా? ఏమిటి గొడవ?" అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తూ అడిగాడు శ్రీధరం.

"దాన్నే అడుగు!" కోపంగానే అన్నాడు రామారావ్.

ఇక ఇలా లాభంలేదని లోపలకు నడిచాడు శ్రీధరం. పడగ్గదిలో మంచంకింద నుంచి సూట్‌కేస్ బయటకు లాగి తన బట్టలు సర్దుకొంటోంది రాధ.

'అంటే బహుశా ప్రయాణ సన్నాహాలు చేస్తోందన్నమాట!' అనుకొన్నాడతను.

"చూడమ్మా రాధా! ఏమయింది—ఇద్దరూ కోపాల్తో ఉన్నారు?" నెమ్మదిగా అడిగాడు గడపలో నుంచుని.

"జరిగిందేమీలేదు! ఇలాంటి అనుమానపు మనుష్యుల దగ్గర ఉండటం నాకిష్టం లేదు! సంవత్సరం నుంచీ సంసారం చేస్తూ—భార్య మనసెలాంటిదో గ్రహించలేని మొగుడితో కాపురం చేయడం కంటె పుట్టింట్లో పడి ఉండడం మంచిది...." అంది సూట్‌కేస్ సర్దటం ముగిస్తూ.

ఇదేదో చాలా దూరం పోయిందనిపించింది శ్రీధరానికి. ఇవే చిన్న సంఘటనలు పెరిగి—

పెద్దవయి – శాశ్వతంగా సంసారాన్ని నాశనం చేస్తాయి. తనకున్న పరిజ్ఞానం–తెలివీ–అంతా ఉపయోగించి తన స్నేహితుడి సంసారాన్ని చక్కబెట్టాలనుకొన్నాడు శ్రీధరం.

"చూడమ్మా! జరిగిందేమిటో చెప్పకూడదూ! వాడి తప్పయితే ఇద్దరం కలసి నాలుగూ దులిపేద్దాం వాడిని...." బ్రతిమాలుతోన్నట్లు అన్నాడు శ్రీధరం.

రాధ కొంచెం మెత్తబడింది.

"శంకరం అనీ – అతను మా స్నేహితురాలు పద్మ తమ్ముడండీ! నా దగ్గర అతనికి బాగా చనువు మొదట్నుంచీ! ఆ అభిమానం కొద్దీ ఎక్కడ కనబడినా పలకరించి పోతుంటాడు. అదేమో ఈయనగారికి కోపం! అతనికీ నాకూ-లేనిపోని సంబంధం అంటగట్టి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతూంటే సహించలేకపోయాను. ఎదురు తిరిగి సమాధానం చెప్పేసరికి నా మీద చెయ్యి చేసుకున్నారు. మీరెన్నయినా చెప్పండి-నాకు మనసు విరిగిపోయింది. ఇంక ఈ మనిషితో కాపురం చేయడం నావల్లకాదు. నేనూ బి.యు.సి చదువుకొన్నాను. ఎక్కడో చోట నా పొట్ట పోషించుకునే ఉద్యోగం దొరక్కపోదు...."

ఎప్పుడు వచ్చాడో రామారావు శ్రీధరం పక్కనే నిలబడి ఉన్నాడు.

"పో! ఉద్యోగం చేసుకుంటావో–అడుక్కుతింటావో–ముందు ఈ ఇంట్లోంచి బయటకు నడు...." తీవ్రంగా అన్నాడతను.

"ఒరేయ్ రామారావ్! అలా ఇష్టమొచ్చినట్లు మాట్లాడకు! నన్నడిగితే ఆ అమ్మాయిదేమీ తప్పు లేదంటాను!" అన్నాడు శ్రీధరం మందలింపు ధోరణిలో.

"నీకు తెలీదురా! ఇప్పుడు కాదు! మొదట్నుంచీ చెప్తూనే ఉన్నాను. ఆ కుర్రాడితో మాట్లాడొద్దని. సరేనని–మళ్ళీ తను చేసే పని చేస్తూనే ఉంటుంది. ఆ కుర్రాడితో ఏ సంబంధం లేకుండానే ఇవాళ నేను ఆఫీసుకెళ్ళినప్పుడు ఇంట్లోకి పిలిపించుకొందా?"

"చూశారా! చూశారా! మళ్ళీ అదేమాట!.... ఇవాళ శంకరం ఇక్కడికి దగ్గర్లోనే ఉన్నవాళ్ళ స్నేహితుడింటికి వచ్చాట్టండీ! అందుకని కొద్దిసేపు మా ఇంట్లో కూడా కూర్చుని వెళ్ళాడు. ఇందులో నా తప్పేముందండీ! వచ్చిన వాళ్ళని. "రావద్దు-మా ఆయన మనిద్దరి మీద అనుమాన పడుతున్నాడని" చెప్పమంటారా - సిగ్గులేకుండా? నావల్లకాదు అలా సంస్కారంలేని మాటలు మాట్లాడ్డం!...." అందుకొంది రాధ.

"నోర్మూసుకో – నీతిలేని వాళ్ళకి సంస్కారం కూడానా ఏమిటి?" ఆమె మీదకి వెళ్ళబోయాడు రామారావ్.

శ్రీధరం అతనిని గట్టిగా పట్టుకుని బయటకు లాక్కెళ్ళాడు.

"ఒరేయ్ రామారావ్! ఆవేశంలో ఏంమాట్లాడుతున్నావో, ఏం చేస్తున్నావో నీకు తెలీటం లేదు. కాసేపు దయచేసి ఊరుకో-మనం అలా పార్కువేపు వెళ్ళి అన్నీ మాట్లాడుకుందాం! ....ఇప్పుడే వస్తానుండు...." అనేసి లోపలికి నడిచాడు.

రాధ సూట్‌కేస్ తీసుకుని బయటకు రాబోతోంది అప్పుడే!

"చూడు రాధా! ఆవేశంలో మనిషి వివేకాన్ని కోల్పోతాడు! పశువులా మారిపోతాడు. తర్వాత ఎంత పశ్చాత్తాప పడితే మాత్రం ఏం లాభం? దయచేసి నువ్విప్పుడు ఎక్కడికీ వెళ్ళకు! క్షణికావేశంలో ఇద్దరూ పచ్చని సంసారాన్ని పాడు చేసుకోకండి! రామారావుకి నేను నచ్చచెప్తాను! అతనెంత తప్పు పని చేస్తున్నాడో విశదీకరిస్తాను! ఏం?"

మౌనంగా వుండి పోయింది రాధ.

తనే ఆమె చేతిలోని సూట్‌కేస్ అందుకొని లోపల పెట్టేశాడు శ్రీధరం.

"నువ్ కాసేపు విశ్రాంతిగా కూర్చో! నేనీ లోపల వాడికి బ్రెయిన్ వాష్ చేస్తాను...." అంటూ బయటకు నడిచాడు.

ఇద్దరూ పార్కుకి చేరుకొన్నారు.

"ఒరేయ్! కట్టుకొన్న భార్య మీద అలా కచ్చితమైన ఆధారం లేకుండా అనుమాన పడ్డానికి నీకేమయినా మతుందా? ఆ అమ్మాయి కల్లాకపటం తెలీని ఉత్తమురాలన్న సంగతి నువ్వు కూడా చాలాసార్లు అన్నావ్ నాతో! గుర్తులేదూ?" అన్నాడు. శ్రీధరం కొద్ది క్షణాలు మౌనంగా కూర్చున్నాక.

రామారావ్ తల వంచుకున్నాడు.

"అదికాదురా! అనేకసార్లు చెప్పాను! అదివరకు ఓసారి ఆ కుర్రాడితో ఇలాగే మార్కెట్లో తిరుగుతూ కనబడింది. అలా చేయటం నా కిష్టం లేదని చెప్పాను. సరేనంది. తరువాత ఒకటి, రెండుసార్లు మళ్ళీ అతను కనిపించినప్పుడు, తన దారిన తను రాకుండా, పలకరించి మాట్లాడి మరీ వచ్చింది. మళ్ళీ కోప్పడ్డాను. మరోసారి అతనిని పలకరించడంగాని, మాట్లాడడం గాని చేస్తే నేను సహించనని చెప్పాను. తీరా నిన్న అతగాడిని ఇంట్లోకి రప్పించుకొంది. ఎప్పుడొచ్చాడో తెలీదు. నేను ఆఫీస్ నించి వచ్చేసరికి అప్పుడే అతను బయటకు వెళ్ళిపోతూ కనిపించాడు! కళ్ళకు కనబడిన నిజాన్ని ఎలా కాదనుకొనేది? వాడంటే లోపల ఆ భావం లేకపోతే, నేను మందలించినా ఇంకా వాడితోనే ఎందుకు సంబంధం పెట్టుకొంటోంది? నేను అడిగితే 'నాకేం తెలీదు? ఆ కుర్రాడే వచ్చాడం'ది! రానీయవద్దని చెప్పానుగదా అంటే, ఇష్టమొచ్చినట్లు సమాధానాలు చెప్పింది! దాంతో నా అనుమానం బలపడింది...."

"నోర్మూసుకోరా! సిగ్గుండాలి – రాధ మీద అనుమానపడడానికి! పాపం! ఓ పక్కన చెప్తోనే ఉంది—ఆ కుర్రాడు తన స్నేహితురాలి తమ్ముడని! నువ్వు శాసించావని హఠాత్తుగా ఆ కుర్రాడిని 'మాయింటికి రావద్దని' ఎలా చెప్ప గలదు? తన స్నేహితురాలి దగ్గర–ఇంకా మిగతా వాళ్ళ దగ్గర ఎంత అవమానం ఆ అమ్మాయికి!"

"నీకు తెలీదురా! ఆ కుర్రాడంటే దానికి లైకింగ్ ఉంది...."

"ఉంటే ఉండనీ! తప్పేముంది! మనం చదువుకొన్న వాళ్ళం! సంస్కారం గలవాళ్ళం! మనకూ, సంస్కార హీనుడికీ తేడా ఏమిటి? మనం మాత్రం ఆరాధించిన అమ్మాయిలు లేరూ! కాలేజీలో శాంతి అనే అమ్మాయిని ప్రేమించినట్లు ఎన్నిసార్లు నువ్ నాకు చెప్పలేదు? మనాఫీసులో పని

చేసి ట్రాన్స్‌ఫరయి పోయిన విజయభారతి కన బడితే నువ్వు మాత్రం మాట్లాడవూ ? మాట్లాడావని చెప్పి నిన్నూ-ఆ అమ్మాయిని రాధ అనుమానిస్తే నీ కెలా ఉంటుంది ? అంచేత నేను చెప్పేదేమి టంటే-రాధని పూర్తిగా అర్థంచేసుకొని కూడా మళ్ళీ ఆ అమ్మాయి మీదిలా అనుమానపడటం భావ్యంకాదు !''

రామారావ్ కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినయ్ !

'' నిజమేరా ! ఏదో నా మాట వినలేదన్న ఉద్దే శంలో – అలాంటి అనుమానాలొచ్చినయ్‌గాని.... రాధ మీద అలా–కేకలేయడం నాదే తప్పు !....''

తలవంచుకొనే అన్నాడతను.

'' చాలు ! ఈ మాత్రం రాధతో చెప్పేవంటే పాలు–నీళ్ళలాగా కలసిపోతారు ఇద్దరూ మళ్ళీ ! పద ! త్వరగా ఇంటికెళ్దాం !''

ఇద్దరూ లేచి ఇంటి వేపు నడువసాగేరు.

రాధ వారి కోసమే ఆత్రుతగా ఎదురు చూస్తూ నుంచుంది బయట !

శ్రీధరంతోపాటు తనూ లోపలికి నడిచింది.


'' చూడు రాధా ! వాడు తన తప్పు తెలుసు కున్నాడు ! నువ్వు కూడా ఇకముందు వాడికిష్టమైన పనులే చేస్తే ఈ గొడవలే రావు !....'' అన్నాడు నెమ్మదిగా.

'' నేనూ ఇప్పటివరకూ ఆలోచించానండీ ! నాది కూడా తప్పుంది ! ఆయన వద్దన్న పని చేయ బట్టేగా ఇంత గొడవ ! నేను వద్దన్న పనులు-ఆయనెన్ని మానివేయడం లేదు ! సిగిరెట్లు నా కోరికపైనే మానేశారు. పేకాట మానేశారు...!!''

'' సరే ! నేనిక వెళ్తాను....'' అంటూ ఇద్దరకూ చెప్పి బయటపడ్డాడు శ్రీధరం ! తర్వాతేం జరుగుతుందో శ్రీధరం తేలిగ్గా ఊహించు కొన్నాడు.

'' నాదే తప్పంటే, నాదే తప్పని'' ఇద్దరూ కౌగిట్లో కరిగిపోతారు !

చాలా గర్వం కలిగింది శ్రీధరానికి. తను ఓ సంసారాన్ని నిలబెట్టాడు. ''భార్య మీద అను మానం'' అనే జబ్బును నివారణ చేశాడు ! ఎవరు చేయగలరలాంటి పవిత్రమైన కార్యాన్ని ? నిజానికి ఆ మాత్రం విశాలభావాలు లేకపోతే సంసారాలేం నిలబడతాయ్ ! 'ఆడది' అనగానే నీతిలేనిదానిగా,




వ్యక్తిత్వం, సంస్కారం తెలీని దాన్నిగా కొట్టి పారేయడమేనా మగాడి నాగరికత ? అలాంటి మగాళ్ళ సంకుచిత దృష్టి ఎప్పటికి మారుతుందో ఏమో !—

ఇల్లు చేరుకున్నాడతను సంతోషంగా ! ఇంట్లో నుంచి అతని భార్య సుభద్ర కిలకిలా నవ్వటం వినిపించింది.

'' ఏమిటో అంత సంతోషానికి కారణం ?'' అనుకొంటూ తలుపు తట్టాడతను.

కొద్ది క్షణాల తర్వాత తలుపులు తెరిచిందామె.

లోపల కుర్చీలో తీరిగ్గా కూర్చుని కనిపించాడు బాబూరావ్.

'' నమస్కారమండి !'' అన్నాడు శ్రీధరాన్ని చూడగానే ! ప్రతినమస్కారం చేసి, మౌనంగా తన గదిలోకి నడిచాడు శ్రీధరం. అతడి ముఖం మారిపోయింది !

ఆ బాబూరావ్ సుభద్రకి దూరపు బంధువు. ఇద్దరూ కలిసి చదువుకొన్నారట! అతను సుభద్రని ప్రేమించాడట ! పెళ్ళి కూడా చేసుకొందామను కొన్నాడటగానీ పెద్దవాళ్ళమధ్య పేచీలు రావడంతో వివాహం జరగలేదుట !

ఇవన్నీ వివాహమయిం తర్వాత ఎవరో తనకి చెప్పారు. ఆ రోజు నుంచీ వీలయినంతవరకూ సుభద్ర అతనిని కలుసుకోకుండా చూస్తూ వచ్చాడు. అయినాగాని వాళ్ళేమయినా ఉత్తరాలు రాసు కొంటున్నారేమో అన్న అనుమానం బాధిస్తూనే ఉండేది. ఇప్పుడలా అకస్మాత్తుగా అతను రావడం, సుభద్ర అంత సంతోషంగా కిలకిలా నవ్వడం ఇవన్నీ అతని అనుమానాన్ని బల పరచినయ్.

'' నేను వెళ్తానండీ. ఇంకో అరగంటలో బస్సుంది ! అర్జంటుగా ఈ ఊళ్ళో పనుండి ఉదయం వచ్చాను ! – వెళ్తూ వెళ్తూ ఓ సారి మిమ్మల్ని చూచిపోదామని...వచ్చాను....'' అతను వెళ్లిపోయాడు.

'' ఏమిటలా ఉన్నారు ?'' అంది సుభద్ర శ్రీధరం దగ్గరకొస్తూ.

'' నిజం చెప్పు ! వాడెందుకొచ్చాడు ?''

నివ్వెరపోయింది సుభద్ర !

'' బావ గురించేనా మీరు మాట్లాడేది ?'' అంది ఆశ్చర్యంగా.

'' అవును....నీ పాత ప్రియుడు.''

'' ఏమిటా పాడు మాటలు....'' అంటుండ గానే ఆమె చెంప ఛెళ్లుమంది.

కళ్ల బైర్లు కమ్మినయ్ !

'' నాకేం తెలీదండీ. నా మాట నమ్మండీ....''

స్పృహ తప్పేవరకూ దెబ్బలు తింటూనే ఉందామె.

'' మరొక్క క్షణం కూడా ఈ ఇంట్లో ఉండ డానికి వీల్లేదు! పో...మీ ఇంటికి....'' క్రూరంగా అరచాడు శ్రీధరం.

మహిళా దశాబ్దంలో మళ్ళీ ఓ మగువ కథ ప్రారంభమయింది.... □